స్వాతి - ఆగస్ట్, 1997

"మీకు దేవుడంటే ఇష్టం. మిమ్మల్ని దేవుణ్ణి చేసి రోజూ కాళ్ళు కళ్ళకద్దుకుంటాను. మీకు లెక్కలంటే అయిష్టం. మిమ్మల్ని లెక్కచెయ్యనని మాటిస్తున్నాను"

# లెక్కల మాస్టారు

నేను తెలివైనవాడినని పేరు తెచ్చుకున్నాను. కానీ నాకు లెక్కలంటే చెప్పలేనంత భయం. తప్పనిసరి కాబట్టి ఎలాగో మెట్రిక్‌దాకా భరించి - ఆ తర్వాత లెక్కలన్నవి దగ్గరకు రాకుండా జాగ్రత్తపడి ఎమ్మే పూర్తిచేశాను.

నా అదృష్టంకొద్దీ - నాకొచ్చిన మంచి ఉద్యోగం కూడా లెక్కలతో సంబంధం లేనిదే!

శోభనం రాత్రి అందమైన శిల్పంలా అనిపించింది కానీ - నా భార్య బాగా లెక్కల మనిషని ఆ వెనువెంటనే తెలిసింది. లెక్కల్లో ఫస్టు వచ్చే తనని కేవలం ఆడపిల్ల అన్న కారణంతో అటు ఇంజనీరింగుకీ పంపక, మధ్యలో మానిపిస్తే ప్రైవేటుగా కట్టడం కష్టమని ఇటు సైన్సు కూడా చదవనీక ఆర్ట్సు సబ్జక్టులో పెట్టినందుకు తల్లిదండ్రుల మీద చాలా అక్కసుందామెకు.

ఇంతకీ బియ్యే అయితే కానీ పెళ్ళికానే లేదు. ఆమె తనకున్న కోరికలన్నీ చెప్పి, వాటిని పంచవర్ష ప్రణాళికలో అమర్చి ఏడాది కింతని కేటాయింపు చేసి, నెలకెంత కావాలో తేల్చేసరికి నా జీతమెంత తక్కువో అర్థమై నీళ్ళు గారిపోయాను. తను ఎమ్మెస్సీ చదివుంటే నాకంటే ఎక్కువ సంపాదించేదనీ, అప్పుడు సంసారం సుఖంగా గడిచేదనీ ఆమె వాపోతే నేను పూర్తిగా చతికిలబడిపోయాను.

అయితే - నా జీతం తక్కువన్న నిజంకంటే మా ఖర్చులగురించి ఆమె కట్టిన లెక్కలే నన్నెక్కువ బాధించాయి. ఎందుకంటే అవి లెక్కలు కాబట్టి! నేనామెతో లెక్కలంటే నాకున్న భయాన్నీ, అలర్జీనీ చెప్పేసుకున్నాను. ఆది నిష్ఠూరం మంచిదని!

నేనన్నది సరిగ్గా అర్థంకాలేదో, సెన్సాఫ్ హ్యూమరో మరి - "మీకు దేవుడంటే ఇష్టం. అందుకే అమ్మా, నాన్నల సలహాకూడా పాటించి మిమ్మల్ని దేవుణ్ణి చేసి రోజూ కాళ్ళు కళ్ళకద్దుకుంటున్నాను. మీకు లెక్కలంటే అయిష్టం. అందుకే అమ్మా, నాన్నల

సలహాను కూడా వ్యతిరేకిస్తూ - మిమ్మల్ని లెక్కచెయ్యనని మాటిస్తున్నాను. సరా?" అందామె. అప్పట్నించీ ఆ మాటను నిలబెట్టుకోవడమే ధ్యేయమన్నట్లు కాపురం చేస్తోంది.

అలా ఏడాది గడిచేక ఓ రోజున మంచి మూడ్‌లో వుందేమో, "ఉద్యోగం ఉద్యోగం అంటారు కానీ ఆడవాళ్ళకు గృహిణి జీవితమే సుఖం - ఎటొచ్చి మీలాంటి భర్త వుండాలి" అని నన్ను పొగిడింది.

విని ఊరుకోవచ్చుగా, నేను అతి తెలివికి పోయి, "మగాడేదో సుఖపడిపోతున్నా డనుకుంటారు కానీ వాడిది బానిసబ్రతుకు. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిందంతా భార్యాబిడ్డలకు ధారపోయడమే వాడి జీవిత పరమావధి" అన్నాను.

అంతే! నా భార్య ఆగ్రహించలేదు. ముఖం మీద చిరునవ్వు చెరగనివ్వలేదు.

నన్నెలా ఎదురుదెబ్బతీయాలో బాగా తెలిసిన దానిలా లెక్కల పురాణం విప్పింది. ఉదయం లేచింది మొదలు పక్కలో చేరేదాకా తను చేసే ప్రతిపనికీ బయటివాళ్ళెంత తీసుకుంటారో ఆ ప్రకారం లెక్కకట్టి రోజువారీ ఖర్చువేస్తే అది నానెల జీతాన్ని మించిపోయిందని తేలింది.

"ఇప్పుడు చెప్పండి - బానిస బ్రతుకెవరిదో-" అంది నా భార్య అప్పటికి తన లెక్కల పురాణాన్ని ముగిస్తూ.

"నన్ను లెక్కచెయ్యనని మాటిచ్చావు. కానీ నా ముందు లెక్కలు చెయ్యననీ, మాట్లాడననీ కూడా మాటివ్వు. ప్లీజ్ - ఈ లెక్కలు భరించడం నా వల్ల కాదు" అన్నాను.

నా మాట అబద్ధం కాదని ఆమెకూ తెలుసు... పాలవాడొస్తాడు. లీటరు పదకొండు రూపాయల చొప్పున ముప్పయి ఒక్కరోజులు పోశానంటాడు. రెండు పూటలు అరలీటరూ, రెండుసార్లు పావులీటరూ, మూడుసార్లు ముప్పావు లీటరూ అదనంగా పోశానంటాడు. ఎంతైందో చెబుతాడు. నా బుర్ర బద్ధలైపోతుంది.

చాకలి వస్తాడు. నెలలో 56 బట్టలు పడ్డాయంటాడు. రుమాళ్ళ ధర వేరు. డ్రాయర్లూ, బనీన్లూ వేరు - చీరలు వేరు, దుప్పట్లు వేరు - పాంట్లు వేరు, షర్టులు వేరు. జాకెట్లు వేరు, లంగాలు వేరు. అన్నింటికీ తలో ధరా కట్టి ఎంతయిందో చెబుతాడు. నా బుర్రలో అగ్నిపర్వతం పేల్తుంది.

కాగితాలు కొనేవాడొస్తాడు. వార్తాపత్రికలు వేరు. వారపత్రికలు వేరు. మాసపత్రికలు వేరు. తూకంవేసి విడివిడిగా ధరలు కట్టి కలిపి చెబుతాడు. ఆ వివరాలు నా మెదడు చీలికల్లో ఇరుక్కుని చీముపోసుకుని బాధిస్తాయి.

అందరిళ్ళలో ఇవి మగాళ్ళు చూసుకుంటారు. నా ఇంట్లో నా భార్య చూసుకుంటుంది. అంతవరకూ బాగానే వుంది. కానీ ఈ లెక్కల పేరు చెప్పి నా భార్య నాపై ఆధిపత్యం వహిస్తోంది. నన్ను భయపెట్టి తనక్కావలసినవి సాధిస్తోంది.

ఉదాహరణకు పండక్కి పట్టుచీరంటుంది. నేను డబ్బులేదంటాను. పేపర్లమ్మితే ఇంతొచ్చింది, ఇంక్రిమెంటొచ్చి జీతమింత పెరిగింది, అపరాల్లో ఈ నెలకింత తగ్గుతుంది - అంటూ ఏవో లెక్కలు చెప్పి - పట్టుచీరతోపాటు వెండి కుంకుమభరిణ కూడా

డబ్బులున్నాయని తేలుస్తుంది.

నాకు లెక్కలంటే భయంకదా, "సరే - నీ ఇష్టం!" అంటాను. కానీ నేనన్నది కాదని తానన్నది ఆమె ఇంత సులభంగా సాధించుకోవడం నాకు మింగుడుపడడం లేదు...

ఆఫీసులో మూర్తి నాకు మంచి స్నేహితుడు. అతడి కబుర్లను బట్టి పెళ్ళాన్ని బాగా అదుపులో వుంచుతాడని అర్థంచేసుకున్నాను. ఏడాదిలో మేము వాళ్ళింటికి రెండుసార్లు వెళ్ళాము. వాళ్ళూ మా ఇంటికి రెండుసార్లు వచ్చారు. నిప్పును గుడ్డలో దాచడం సాధ్యం కాదు కదా? వాళ్ళ ముందు నా భార్య ప్రతాపం దివ్యతేజంతో ప్రకాశించింది.

"నీ భార్య ఫాస్టు. నా భార్య ఫాస్టుగా మారడం నాకిష్టంలేదు. కాబట్టి మన పరిచయం ఆఫీసుకు పరిమితం కావడమే మంచిది" అన్నాడు మూర్తి ఆ తర్వాత.

మొహమాటపడి అప్పటికేమీ అనలేదు నేను. కానీ కొన్నాళ్ళకు ఆగలేకపోయాను. మూర్తికి నా ఇబ్బందికి చెప్పుకుని, "నా భార్య ఫాస్టుగా వుండడం నాకూ ఇష్టంలేదు. నీ భార్యను మొదట్నించీ నువ్వెలా అదుపులో వుంచావో చెప్పు" అనడిగాను.

"అది తర్వాత - అసలు నీ భార్య అదుపెలా తప్పిందో ముందు చెప్పు"- అన్నాడు మూర్తి భయాన్ని కుతూహలంలో దాచడానికి ప్రయత్నిస్తూ.

లెక్కల గురించి చెప్పాను.

"లెక్కలు తెలివికి చిహ్నం. చేసినకొద్దీ అవి మనిషి తెలివిని అలా అలా పెంచుకుంటూపోతాయి. నువ్వు నీ భార్య చేత లెక్కలు ఆపించాలి. అప్పుడు నీకు జయం లభిస్తుంది. అయితే ఉష్ణం, ఉష్ణేన శీతలం అన్నట్లు, వజ్రాన్ని వజ్రంతోనే కోయమన్నట్లు లెక్కల్నీ లెక్కలతోనే జయించాలి. కాబట్టి ముందు నువ్వు లెక్కలు నేర్చుకో" - అని ఓ బాంబు పేల్చాడు మూర్తి.

అయినా, సినీహీరోలా ఆ బాంబు ధాటికి తట్టుకుని, "ఆడవాళ్ళను జయించే లెక్కలు నువ్వే నాకు నేర్పాలి" అన్నాను - అప్పటికవి ఇంకోరకం లెక్కలన్నట్లు ఆశగా!

"నేర్పేవాణ్ణే - కానీ నాకూ లెక్కలురావు మరి!" అన్నాడు మూర్తి.

"అయితే నువ్వు నీ భార్యనెలా జయించావు?"

"ఆమెకు లెక్కలు రావు. అది మొదటి కారణం. ఆమె నాకు లెక్కలు వచ్చుననుకుంటుంది. అది రెండో కారణం. ఈ రెండో కారణాన్ని కాపాడుకుందుకే నేను మీ ఇంటికి రావడం మానేశాను. నీ భార్య ప్రతిదానికీ లెక్కలు మాట్లాడుతుంది. ఎక్కడో అక్కడ దొరికిపోతానని నా భయం" అన్నాడు మూర్తి.

సమస్య మొదటికి వచ్చింది. నా భార్యకు లెక్కలు బాగా వచ్చు. నాకు లెక్కలు రావని బాగా తెలుసు. మరెలా?

నేనిలా మీమాంసలో ఉండగా మరో కొలీగ్ నా దగ్గరికి వచ్చి, "ఓ రెండొందలు అప్పు కావాలి. రెండ్రోజుల్లో ఇచ్చేస్తాను" అనడిగాడు.

"రెండు కాదు, మూడ్రోజులను" అన్నాను అప్రయత్నంగా.

కొలీగ్ నావంక ఆశ్చర్యంగా చూశాడు.

రెండ్రోజులంటే నాకు భయం, చిన్నప్పుడు అమ్మ నన్ను బూజులు దులపడానికి పిలిచేది. రెండ్రోజుల్లో చేద్దామనేవాణ్ణి.

నాన్నగారు తన కథలు ఫెయిర్ చెయ్యమన్నా రెండ్రోజులనేవాణ్ణి. రెండ్రోజులనే పదాన్ని - తాత్కాలిక ప్రమాద నివారణోపాయంగా మాత్రమే నేను గుర్తించాను. అదికాక ఇంకెన్ని రోజులన్నా నాకు నిజాయితీగా తోస్తుంది.

కొలీగ్‌కిదంతా చెప్పడం బాగుండదు కదా - అందుకని, "ఇంకా పెళ్ళీ పెటాకులూ లేవు కదా, నీకు అప్పేమిటి?" అంటూ మాట మార్చాను.

"ఇలా అనుకునే వరుసగా అందరూ నా దగ్గర అప్పులు చేసేస్తూంటే నేను నెల మధ్యలోనే వట్టిపోతున్నాను. ఈ రెండొందలైనా నాకోసం కాదు. ఎప్పుడూ అడగని లెక్కల మాస్టారు ఈరోజు ఉదయం నన్నప్పడిగారు. లేదనడానికి నోరు రాక సాయంత్రం ఇస్తాననన్నాను" అంటూ దానకర్ణుడి ఫోజు పెట్టేశాడు కొలీగ్.

లెక్కల మేస్టారనగానే నాలో ఉత్సుకత రేగింది. వివరాలడిగేను. తనుండే వీధిలోనే వుంటున్నట్లు చెప్పాడు కొలీగ్.

"సాయంత్రం ఆయన్ను మా ఇంటికి పంపు. ఆయనతో నాకూ పని వుంది. నేరుగా నేనే ఆయనకు డబ్బిస్తాను" అన్నాను.

ఈ ప్రపంచంలో ఎవరి గొడవ వారిది. అప్పుడే పేరు మాత్రం పరిచయమైన ఆ లెక్కల మేస్టారితో నాకేం పనీ అన్న కుతూహలం కూడా కొలీగ్‌కు కలుగలేదు. అతడుత్సాహంగా, "చాలా థాంక్స్ - అడిగినప్పుడు నిజంగానే నా దగ్గర డబ్బు లేదని ఆయన గ్రహిస్తాడు" అంటూ తన ఇమేజ్‌ను కాపాడబోతున్నందుకు నావంక అద్వాన్సు కృతజ్ఞతల చూపులు ప్రసరించాడు.

ఆఫీసు నుంచి ఇంటికివెళ్ళేసరికి అయిదు. వెడుతూనే నా భార్యకు లెక్కల మేస్టారి అప్పు గురించి చెప్పాను. ఏవో లెక్కలు చెప్పి ఇవ్వగలమనే అంది. అదేమాట లెక్కలేకుండా చెబితే ఎంత బాగుండేదో కదా అనుకుని నిట్టూర్చాను.

ఆరుగంటలకు కొలీగ్ లెక్కల మేస్టార్ని వెంటబెట్టుకుని వచ్చి మాకు పరిచయం చేసి తను హడావుడిగా వెళ్ళిపోయాడు.

ఆయనపేరు రామనాథం. వయసు యాభై దాటినట్లుంది. మనిషి పొట్టిగా, పిట్టలా, దబ్బపండు ఛాయలో వున్నాడు. షర్టు లాల్చీ టైపులో వుంది. పాంటు చార్లీ చాప్లిన్ మోడల్‌ది. ఇది 1997 కావడం వల్ల ఆధునికంగానే కనిపిస్తున్నాడు.

నా నుంచి రెండువందలూ అందుకుని, "రెండ్రోజుల్లో ఇచ్చేస్తాను" అన్నాడాయన థాంక్స్ కంటే ముందు బాకీ తీర్చే ప్రస్తావన తెస్తూ.

"రెండు కాదు, మూడ్రోజులనండి" నా బలహీనత నాచేత అప్రయత్నంగా అనిపించిన వాక్యమిది.

"అంటాను. కానీ మూడ్రోజులన్నా రెండ్రోజుల్లో ఇచ్చేయొచ్చా! ఎందుకంటే నా దగ్గర డబ్బు జత పడితే బాకీ తీర్చడమే ప్రథమ కర్తవ్యంగా భావిస్తాను" అన్నాడాయన. నేను సరేననగానే ఆయన అప్పుడు నాకు థాంక్స్ చెప్పి, "నాతో పని ఉందన్నారుట" అనడిగాడు.

టీలు కలపడానికి కాబోలు - లోపలికి వెళ్ళిన నా భార్య ఇంకా రాలేదు కాబట్టి స్వరం కాస్త తగ్గించినా - ధైర్యంగానే, "నాకు మీరు లెక్కలు నేర్పాలి" అన్నాను.

"లెక్కలు నేర్పడానికి నేనేమైనా లెక్కల మేస్టర్నా? అన్ని విషయాల్లోనూ లెక్కగా వుంటానని చాలామంది నన్ను లెక్కల మాస్టారంటుంటారు. మీకూ నా పేరలాగే పరిచయమైందా?" అన్నాడాయన గంభీరంగా.

అంటే లెక్కలమేస్టారన్నది ఆయనకు నిక్‌నేమ్ అన్నమాట. నా మనసులో బాగా నొచ్చుకున్నా ఏమనాలో తెలియలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సారీ చెప్పడం అసలు తప్పును రెట్టింపు చేస్తుంది.

వాతావరణాన్ని మార్చడానికన్నట్లు - అప్పుడే నా భార్య ట్రేలో రెండు కప్పులతో వచ్చింది.

"అది కాఫీయా, టీయా అమ్మాయ్!" అన్నాడు రామనాథం.

"కాఫీ అండీ!"

"ఏమీ అనుకోకమ్మా - ఎవరిళ్ళకు వెళ్ళినా నేను కాఫీ తాగను - టీయే!"

"అయ్యో, మామూలుగా అయితే ఈ టైములో మేమూ టీయే తాగుతాం. మీకోసమని కాఫీ కలిపాను..." అంది భార్య నొచ్చుకుంటూ.

"అందుకే కలిపే ముందే తెలుసుకోవడం మంచిది. అయితే ఆ మాట నేననకూడదులే - ఎందుకంటే మా ఇంటికొచ్చిన వాళ్ళను మీరేం తాగుతారూ అని అడగం. టీ ఇస్తాం. ఇష్టమైతే తాగుతారు. లేకుంటే లేదు. మేం టీయే ఇస్తాం కాబట్టి ఎవరింటికి వెళ్ళినా టీ మాత్రమే తాగాలని నా ప్రిన్సిపుల్–"

అప్పుడు నా భార్య ఆయనకోసం టీ కలిపి తెచ్చింది. కలిపిన కాఫీని పంచుకుని తాగేశాం. అప్పుడు మాటల సందర్భంలో ఆయన చెప్పిందాన్ని బట్టి వాళ్ళింట్లో మామూలుగా అయితే కాఫీ త్రాగుతారనీ - అతిథి మర్యాదల్లో మాత్రం ఇచ్చి పుచ్చుకోవడాలు రెండింటికీ కూడా టీ నియమముందనీ అర్థమైంది.

పరిచయమైతే లేదు కానీ రామనాథానికి నా గురించిన వివరాలు చాలా తెలుసు. ఒక పెళ్ళి సంబంధం విషయంలో నా సాయం అర్థించాలని చాలాకాలంగా అనుకుంటున్నాడాయన. నా యొక్క, నా బంధువుల యొక్క వివరాలాయన ఏకరువు పెడుతూంటే నేను కంగారుపడి, "నా గురించి మీకు చాలా తెలుసే?" అన్నాను.

మా ఎదురింటి రంగారావింటికి రామనాథం రెండుసార్లు వచ్చేడట. నా గురించి రంగారావే ఆయనకు చెప్పాడు. అయితే రంగారావుకి నా గురించి ఇన్ని వివరాలు తెలుసని నాకూ అప్పుడే తెలిసింది. అమ్మో, ఈ ఇంటర్నెట్ యుగంలో బొత్తిగా ప్రైవసీ

లేదని అనుకుంటూనే - వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలనుకున్నాను.

నాకు రంగారావంటే బోరు. అస్తమానూ తనింటికి రమ్మంటాడు. కానీ వెడితే కబుర్లు నడవ్వు. తను ఒక్కమాట కూడా మాట్లాడకుండా మధ్య మధ్యలో ఒకసారి - "మీరేం మాట్లాడ్డంలేదు" అంటుంటాడు. ఈ రోజు రామనాథాన్ని తీసుకుని వెడితే ఓ విజిట్ కలిసొస్తుందని నా భార్య నన్ను లోపలకు పిలిచి లెక్క చెబితే బాగుందనిపించి - బయటకు వచ్చి ఆయనకు చెప్పాను.

"ఇప్పటికి నేను రంగారావింటికి మూడుసార్లు వెళ్ళాను. అతగాడు రెండుసార్లే మా ఇంటికొచ్చాడు. మూడోసారి మా ఇంటికి వచ్చేదాకా అతడింటికి నేను వెళ్ళే ప్రసక్తి లేనేలేదు" అన్నాడాయన ఖచ్చితంగా.

ఈ లెక్క కొత్తగా అనిపించిందేమో శ్రీమతి కళ్ళలో ఆశ్చర్యం కనిపించింది. అందుకేనేమో జోక్ చేస్తున్నట్లుగా, "అయితే మేము ఇప్పట్లో మీ ఇంటికి రాము. మేము వచ్చేదాకా మీరు మా ఇంటికి రారు కాబట్టి బాకీ కూడా ఇప్పట్లో తీర్చే అవకాశముండదు. మీకు తగినంత వ్యవధి ఇచ్చామన్న తృప్తికూడా మాకు లభిస్తుంది" అంది.

ఆమె తెలివిని అభినందించకుండా ఉండలేకపోయాను. ఎదుటివాడి మనసునేమాత్రమూ నొప్పించకుండా అతడి ఆలోచనల్లోని తప్పును సూచించడం అంతకంటే మెరుగ్గా ఎవరికీ కూడా సాధ్యంకాదేమో -

అయితే రామనాథం చలించలేదు. ఇలాంటివన్నీ ఎప్పుడో ఆలోచించానన్న ధోరణిలో ఆయన, "నా అవసరం కొద్దీ మీ ఇంటికొచ్చానా, లేదా! అలాగే బాకీ తీర్చడానికీ రావాలి. అదయ్యాక - మీరు మా ఇంటికి రెండు విజిట్లు వేసేదాకా మీ ఇంటి గడపతొక్కను. నా దగ్గర అప్పుచేస్తే తప్ప మళ్ళీ మీ దగ్గర అప్పు చెయ్యను" అన్నాడు.

లెక్కల విషయమెలాగున్నా అదో గొప్ప వ్యక్తిత్వమేనని నాకు తోచింది.

"మీకు లెక్కలే జీవితంలాగుంది" అన్నాను.

"కాదు బాబూ - నాకు జీవితమే లెక్కలు" అన్నాడాయన.

ఆ రెండు వాక్యాలకూ తేడా వుందని అప్పుడే నాకు అర్థమయింది. ఆయన వంక గౌరవభావంతో చూశాను. ఆయన వెళ్ళడానికి లేస్తూ, "నేనడిగిన పెళ్ళి సంబంధం విషయం మర్చిపోకండి" అని మరోసారి హెచ్చరించాడు.

ఆయన వెళ్ళిపోయాక పెళ్ళిసంబంధం విషయాన్ని విశ్లేషించుకుంటే - నాకు రామనాథం చాలా ముచ్చటేశాడు. వధువు ఆయన స్నేహితుడి కూతురు. వయసు ఇరవైమూడు. రామనాథానికి ఇంచుమించు అదే వయసు కూతురుంది. మూడేళ్ళక్రితమే ఆ పిల్లకు పెళ్ళయింది. తన స్నేహితుడి కూతురి పెళ్ళి గురించి - ఆ పిల్ల తండ్రికంటే ఎక్కువగా ప్రయత్నాలు చేస్తున్నాడు రామనాథం. మరి నాకు ముచ్చటేయదూ?

వాళ్ళనుకుంటున్న వరుడు నా చేతిలోని మనిషి. నేను ఓ మాటంటే చాలు - ఈ పెళ్ళి కుదిరిపోతుంది. అలాగని ఏదో ఒక మాట చెప్పలేం కదా! వధువు గురించి నా తరఫునుంచి నేనూ మరిన్ని ఆరాలు తీయాలనుకున్నాను.

అందుకు నాకు రామనాథం స్నేహితుడితో పరిచయం కావాలి మరి!

ఈలోగా రామనాథం మనసు నొచ్చుకోకూడదని అప్పిచ్చిన రోజు విడిచి - రెండ్రోజుల తర్వాత సాయంత్రంపూట సతీసమేతంగా రామనాథం ఇంటికి వెళ్ళాను. రామనాథం భార్య మాటలు వింటూంటే అన్ని విధాలా ఆయనకు అనుకూలవతి అనిపించింది. ఆ దంపతులు టీ ఇచ్చి మాకు మర్యాద చేశారు.

రామనాథం మాత్రం, "నువ్వొక్కడివే వస్తావనుకొన్నాను" అన్నాడని నా భార్య కాస్త నొచ్చుకుంది. మరి మా ఇంటికాయన ఒక్కడే వచ్చాడు.

అది మేము అంతగా పట్టించుకోకపోయినా ఆయన ఊరుకోరు కదా!

అన్నప్రకారం రామనాథం నా బాకీ తీర్చేశాడు. నేనడిగితే వధువు వివరాలు చెప్పాడు. మిగతావి తెలుసుకుందుకు నన్నే స్వయంగా వాళ్ళింటికి వెళ్ళమన్నాడు. తను రానన్నాడు. అందుకు కారణాలడగడానికేముందీ - లెక్కల మేస్టారు కదా!

నాకు రామనాథం స్నేహితుడితో పరిచయమైంది. ఆ కుటుంబం నాకు నచ్చింది. నా ప్రోద్బలంతో - రామనాథం స్నేహితుడి కూతురి పెళ్ళి కుదరింది. ఆ పెళ్ళికి వధువు తరఫువారు కూడా మమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

ఇలాంటి సమయంలో నా అత్తగారికి పెద్ద జబ్బుచేసింది. వైద్య సదుపాయాలు బాగుంటాయని మామగారావిణ్ణి వెంటబెట్టుకుని ఈ ఊరొచ్చారు. మా ఆవిడ - అత్తగారికి ఆరోప్రాణం. దగ్గరుంటే ఒక్కక్షణం కూడా వదలదు. నా భార్యకీ అదే సెంటిమెంటు. ఆ తల్లీకూతుళ్ళ అనుబంధం ఏ లెక్కలకూ అందనిది.

అత్తగారికి ఒక డాక్టరు నూరేళ్ళాయుష్షంటాడు. ఇంకో డాక్టరు రోజుల్లో ఉందంటాడు. రోగానిక్కూడా తలో డాక్టరూ తలో పేరూ పెడుతున్నాడు. విజ్ఞానం ఇలా సందిగ్ధావస్థలో పడుతూంటే మేమందరం దేవుడిమీద భారంవేసి మానవ ప్రయత్నాలు కొనసాగిస్తున్నాం.

ఈ పరిస్థితుల్లో నేను కుదర్చిన ఆ పెళ్ళికి నేనొక్కణ్ణి మాత్రమే వెళ్ళగలిగాను. అక్కడ నాకు ప్రత్యేక గౌరవం లభించింది. అందరూ నా భార్య గురించి అడిగారు.

నిజానికి ఈ పెళ్ళికి అసలు ప్రోద్బలం రామనాథానిది. అలాంటి ఆయన గురించి ఎవరూ పట్టించుకోకపోవడం అసహజంగా తోచి నేను వచ్చినవాళ్ళలో కొంత వాకబు చేయగా ఇటీవలే రామనాథం అత్తగారు పోయినట్లు తెలిసింది.

ఆ విషయం నాకు తెలియనందుకు నొచ్చుకుని - మరొకాయన దగ్గర, "పాపం అత్తగారు పోవడం వల్ల రామనాథంగారీ పెళ్ళికి రాలేకపోయినట్లున్నారు. ముహూర్తం పన్నెండోరోజు లోపే పడినట్లుంది-" అన్నాను.

పెళ్ళి హడావుడిలో వున్న వధువు తండ్రికీ మాటలెలా వినబడ్డాయో ఏమో ఆయన చటుక్కున నా ముందు ప్రత్యక్షమై, "వాడి అత్తగారి వయసు డెబ్బైఏళ్ళు. పోయి నెల్లాళ్ళయింది. పువ్వులా వెళ్ళిపోయిందని సంతోషించినవారే తప్ప కన్నీళ్ళు పెట్టినవారు లేరు. రామనాథం పెళ్ళికి రాకపోవడానికి కారణం అదికాదు. అనుకోని కారణాల వల్ల

వాడి కూతురు పెళ్ళికి మేము వెళ్ళలేకపోయాం. అది బాకీ తీర్చుకోవాలని ఒకటే తహతహలాడిపోతున్నాడు. నా కూతురి పెళ్ళి ఆలస్యమైపోతోందని అసహనంతో వేగిపోయాడు.

దాని పెళ్ళి తొందరగా కుదరాలని శతవిధాల ప్రయత్నించాడు. ఈ పెళ్ళి కుదిరిందంటే - మీ ప్రయత్నం కంటే కూడా - వాడి సంకల్పబలమే ముఖ్య కారణం. ఇక పెళ్ళికి రావడం విషయమంటారా - వాళ్ళమ్మాయి పెళ్ళయ్యాక మూడోరోజున మేము చూడ్డానికి వెళ్ళాం. తనూ అదే చేస్తాడు" అని నా సందేహం తీర్చి వెళ్ళాడు.

"ఔరా, లెక్కల మేస్టారూ!" అనుకున్నాను. ఇంటికి వెళ్ళేక నా భార్యకు జరిగింది చెప్పి, "అక్కడ ఆ లెక్కల మేష్టారూ, ఇక్కడ ఈ లెక్కల మేస్టారూ - ఇద్దరూ పెళ్ళికి రాలేదు. అయినా అంతా ఈ లెక్కల మేస్టారుగురించే అడిగారు" అంటూ తనలో గర్వం పుట్టించాను...

ఆ గర్వంలోంచే నా భార్యకు రామనాథం మీద జాలికూడా పుట్టినట్లుంది. "మనమాయనింటికి వెళ్ళి నెలదాటిపోయింది. ఓసారి వెళ్ళివస్తే కానీ బాగుండదు. అయినా ఆయన అత్తగారు పోయినందుకు పరామర్శించినట్లూ వుంటుంది" అంది.

"తన లెక్కలతో ఇతరులకు మేలు చేయాలనుకునే ఆయన వ్యక్తిత్వం ఆదర్శ ప్రాయం. తప్పకుండా వెడదాం. ఆయనా మనింటికి వచ్చి చాలా కాలమయింది. అసలే లెక్కలమేస్టారు. మనం వెడితే కానీ రారు కదా" అన్నాను.

"అవును" అన్న శ్రీమతి ఉన్నట్లుండి కెవ్వుమని కూడా అరిచింది.

"ఏమయిందీ?" అన్నాను మా అత్తగారిక్కానీ ఏమైనా అయిందా అని కంగారు పడుతూ. ఈ మాటల హడావుడిలో చెప్పడం మర్చిపోయి ఇప్పుడామెకా విషయం గుర్తుకొచ్చి వుండొచ్చు.

"నాకు రావడమెలాగూ కుదరదు. మీరు కూడా ఇప్పట్లో ఆయనింటికి వెళ్ళకండి. తర్వాతెప్పుడైనా వెళ్ళినా కూడా ఆయన్ను పొరపాటున కూడా పరామర్శించకండి" అందామె.

"ఎందుకని?" అన్నాను ఆశ్చర్యంగా.

"నన్నడక్కండి. ఊహించడానిక్కూడా ప్రయత్నించకండి. నేను లెక్కలు చెప్పడం పూర్తిగా మానేస్తాను. కానీ నన్ను మాత్రం ఇంకెప్పుడూ లెక్కల మేస్టారనకండి" అందామె భయంతో వణికిపోతూ.

ఆమె వణుకు చూశాక ఆయన సంకల్పబలానికి గానీ భయపడుతోందా అనిపించినా - మొత్తంమీద నా లెక్కల సమస్య కూడా లెక్కల మేస్టారివల్లనే తీరబోతోందన్న ఆశకూడా నాలో దీపమై వెలగసాగింది.

✦ ✦ ✦